ప్రొద్దుటూరులో భారీగా గోవా రాష్ట్ర మద్యం పట్టివేత

- ముగ్గురు వ్యక్తులు అరెస్ట్
- ఇన్నోవా కారుతో సహా 161 మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం


అరెస్ట్ వివరాలను మీడియాకు వెల్లడిస్తున్న ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : గోవా రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లను తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి ఇన్నోవా కారుతో పాటు 161 మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో అరెస్ట్ వివరాలను అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ మీడియాకు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ ఆదేశాల మేరకు రూరల్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ శివప్రసాద్ సిబ్బందితో కలిసి జమ్మలమడుగు బైపాస్‌రోడ్డులోని చిన్నశెట్టిపల్లె క్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. అదే సమయంలో ప్రొద్దుటూరులోని అమృతానగర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులు ఇన్నోవా కారులో అదే మార్గంలో వస్తుండగా పోలీసులు వాహనాన్ని ఆపారు. తనిఖీ చేయగా అందులో పెద్ద ఎత్తున గోవా రాష్ట్రానికి చెందిన మద్యం సీసాలు ఉన్నాయి. వివిధ కంపెనీలకు చెందిన 161 మద్యం సీసాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అక్రమంగా మద్యం బాటిళ్లను తరలిస్తున్న అమృతానగర్‌కు చెందిన కాటం వీరేంద్ర, కోగటం షరీఫ్, వడ్ల వెంకట నాగ చైతన్యలను అరెస్ట్ చేశారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచనున్నట్లు అడిషనల్ ఎస్పీ తెలిపారు. పెద్ద ఎత్తున మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న సీఐ రమణారెడ్డి, ఎస్ఐ శివప్రసాద్, సిబ్బందిని అడిషనల్ ఎస్పీ అభినందించారు.

ఎన్నికల నేపథ్యంలో విస్తృతంగా తనిఖీలు

రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రొద్దుటూరులో విస్తృతంగా తనిఖీలు చేపట్టామని ఏఎస్పీ తెలిపారు. తగు ఆధారాలు లేకుండా వ్యాపారులు, సాధారణ ప్రజలు పెద్ద మొత్తంలో నగదును తీసుకెళ్లరాదన్నారు. రెండు రోజుల క్రితం మెయిన్‌బజార్‌లోని వాసు స్టూడియో సర్కిల్‌లో బిల్లులు లేకుండా తీసుకెళ్తున్న రూ. 35 లక్షల నగదును సీజ్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ చెప్పారు. అనధికారికంగా మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే క్రికెట్ బెట్టింగ్, మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

దుప్పట్లు పంపిణీ

పోరుమామిళ్ల: రామాయపల్లె ఎస్టీకాలనీకి చెందిన 43 మంది పిల్లలకు ఆదివారం సంక్రాంతి పండుగ సందర్భంగా వివేకానంద ఫౌండేషన్ దుప్పట్లు పంపిణీ చేసింది. ఫౌండేషన్ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ చలికాంలో దాతల సహకారంతో 400 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశామన్నారు. సంస్థ ప్రతినిధులు శివ, రమణయ్య, పీరారెడ్డి, సాయికుమార్, సుధాకర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు పార్వేట ఉత్సవం

రాజుపాళెం : మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం పార్వేట మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సోమేశ్వరస్వామి ఆలయ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి ఆదివారం తెలిపారు. పార్వతీపరమేశ్వరుల గ్రామోత్సవం, తెనాలి వారిచే కాంతార కార్యక్రమం, ప్రొద్దుటూరు వారిచే కోలాటం ఉంటుందని వివరించారు.

ఘనంగా ముగ్గుల పోటీలు


మొదటి బహుమతి విజేతకు నగదు బహుమతి అందజేస్తున్న గోనా వెంకటసుబ్బారెడ్డి

రాజుపాళెం: సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భోగి పండుగను పురస్కరించుకుని మండలంలోని టంగుటూరులో వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ముడియం గౌతమ్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మదన గోపాలస్వామి ఆలయ ఆవరణలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ప్రొద్దుటూరు పట్టణ 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి, దువ్వూరు మండలం పెద్దజొన్నవరం ఎంపీటీసీ సభ్యురాలు సంగీత వ్యవహరించారు. అందులో మొదటి బహుమతి లక్ష్మీదేవికి రూ.5వేలును సోమేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గోనా వెంకటసుబ్బారెడ్డి అందించారు. రెండో బహుమతి సువర్ణకు రూ.3వేలు, మూడో బహుమతి భార్గవ రూ.2వేలు, నాలుగో బహుమతి ఉమామహేశ్వరికి రూ.1000, మిగతా వారికి కన్సోలేషన్ బహుమతులు అందించారు.

ప్రారంభమైన సంక్రాంతి ఉత్సవాలు


పొన్ను సేవ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామి

మైదుకూరు: మైదుకూరులోని శ్రీలక్ష్మీ మాధవరాయ స్వామి ఆలయంలో సంక్రాంతి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో మూల విరాట్‌కు విశేషాలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొన్ను సేవ అలంకారంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మాధవరాయస్వామిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. సాయంత్రం శేషవాహనంపై మాధవరాయస్వామి గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ బదిలీ

బీహార్ రాష్ట్ర క్యాడర్‌కు బదిలీ అయిన ప్రేరణాకుమార్



ప్రొద్దుటూరు క్రైం: ప్రొద్దుటూరు అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ బదిలీ అయ్యారు. ఆమెను బీహార్ రాష్ట్ర క్యాడర్‌కు బదిలీ చేస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె భర్త హిమాన్షు బీహార్ రాష్ట్రంలో ఐపీఎస్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. దీంతో తనను బీహార్ క్యాడర్‌కు బదిలీ చేయాల్సిందిగా ప్రేరణాకుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. 2019వ బ్యాచ్‌కు చెందిన ప్రేరణాకుమార్ స్వస్థలం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్. 2022 ఆగస్టు 30న ఆమె ప్రొద్దుటూరు ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. బీహార్ క్యాడర్‌కు బదిలీ అయిన నేపథ్యంలో నాలుగైదు రోజుల్లో ఆమె రిలీవ్ కానున్నారు.

ప్రొద్దుటూరులో పని చేయడం సంతృప్తిని ఇచ్చింది

ప్రొద్దుటూరులో పని చేయడం తనకు ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందని అడిషనల్ ఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసిన అనంతరం గ్రేహౌండ్స్ అసిస్టెంట్ కమాండర్‌గా పని చేశానన్నారు. అక్కడి నుంచి ప్రొద్దుటూరుకు బదిలీ అయినట్లు చెప్పారు. ప్రొద్దుటూరు సబ్‌డివిజన్‌లో పని చేసిన అనుభవం భవిష్యత్తులో తనకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. విధి నిర్వహణలో ప్రొద్దుటూరు ప్రజలు తనకు ఎంతగానో సహకరించారన్నారు. ఏదైనా ఆపద వస్తే సహాయం చేసే గుణం ఇక్కడి వారిలో ఎక్కువగా ఉందని చెప్పారు. ప్రొద్దుటూరు ప్రజల ప్రేమాభిమానాలు ఎప్పటికీ మరచిపోనని పేర్కొన్నారు.

రూ.6.85 లక్షలు స్వాధీనం

దువ్వూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.6.85లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు దువ్వూరు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఇడమడక చెక్‌పోస్టు వద్ద శనివారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూలు వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా కారు డిక్కీలోని బ్యాగ్‌లో రూ.6.85లక్షల బ్యాగ్‌ను ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తుండటంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. కారులోని వారిని విచారించగా తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ నుంచి అన్నమయ్య జిల్లా మదనపల్లెకు తీసుకెళుతున్నట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న డబ్బును ఇన్‌కంట్యాక్స్ అధికారులకు అప్పగించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

ముద్దనూరు : ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2లక్షల నగదును ఆదివారం సాయంత్రం స్థానిక చెక్‌పోస్టు వద్ద తనిఖీలో స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ నరేష్‌బాబు తెలిపారు. కడప రహదారిలోని చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా నగదు లభించిందని తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులకు ఎమ్మెల్యే రాచమల్లు వరాల జల్లు

- భవన నిర్మాణానికి 7 సెంట్ల స్థలం విరాళం, భూమి పూజ
- నిర్మాణానికి రూ.5లక్షలు విరాళం


7 సెంట్ల డ్యాకుమెంట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పట్టణంలోని ఏపీజే అబ్దుల్ కలాం భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివారం సంఘం కార్యాలయానికి 7 సెంట్ల స్థలం ఇవ్వడంతోపాటు, ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థలం కేటాయించడంతో పాటు భవన నిర్మాణానికి రూ.5లక్షలు అందిస్తానని ప్రకటించారు. సంఘం కార్యాలయం పూర్తయి ప్రారంభం రోజున సంఘం పేరుతో రూ.50లక్షలు డిపాజిట్ చేసి నిధి ఏర్పాటు చేస్తానని తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఏ ప్రభుత్వం వల్ల జరిగిందో గుర్తించి వారిని తిరిగి గెలిపించుకోవాలని కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే విధంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఇచ్చిన వాగ్దానాలను తుంగలో తొక్కి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 30 ఏళ్లుగా పడకేసిన అభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో పరుగులు పెడుతోందన్నారు. స్థానిక టీడీపీ నాయకులు ఏనాడైనా ఏ ఒక్కరికైనా సహాయం చేశారా అని ప్రశ్నించారు. స్థానిక టీడీపీ నాయకులకు, తనకు గల వ్యత్యాసాన్ని గుర్తించి న్యాయం వైపు నిలవాలని ప్రజలకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం 7 సెంట్ల స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్‌ను వారికి అందించారు. సంఘం కార్యాలయానికి 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, 10వ వార్డు కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి రూ.లక్ష చొప్పున ఇద్దరు రూ.2లక్షలు ప్రకటించారు. ఏపీజే అబ్దుల్‌కలాం భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పద్మ వీరన్న మాట్లాడుతూ ఎంతో ప్రేమతో తమ సంఘానికి వరాల జల్లు కురిపించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి రుణపడి ఉంటామని, ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, కౌన్సిలర్లు భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, పిట్టా బాలాజీ, కమాల్ బాషా, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్ యాదవ్, బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు ఉప్పర మురళి, చౌడం రవి, తుపాకుల వెంకటరమణ, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ఓబులేసు, సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కళ్యాణ మండపంలో ఆదివారం దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రంగవల్లుల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని కుటుంబానికి చేదోడుగా నిలవాలన్నారు. దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వుట్టి నాగశయనం మాట్లాడుతూ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించేందుకు గత 14 ఏళ్లుగా సంక్రాంతి సందర్భంగా రంగవల్లుల పోటీలను నిర్వహించి బహుమతులను అందజేస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.6వేల మిక్సీని గోదెన సునీత, ద్వితీయ బహుమతి రూ.5వేల మిక్సీని కాటం శశిరేఖ, తృతీయ బహుమతి రూ.4వేల కుక్కర్‌ను మమతలకు అందచేశారు. 97 మందికి కన్సొలేషన్ బహుమతులుగా రూ.750 విలువచేసే వంటసామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి, కౌన్సిలర్ పోసా వరలక్ష్మి, సంఘం కార్యదర్శి గిద్దలూరు ఈశ్వరయ్య, గంగా జలంధర్, పోసా వేణు, రాగా నరసింహారావు, రామకృష్ణ, వెంకట సుబ్బరాయుడు, వెంకటాచలపతి, వుట్టి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.













పార్టీ బలోపేతానికి కృషి చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బి.కోడూరు : పార్టీ బలోపేతానికి సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు ప్రతిఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రమైన బి.కోడూరులోని సొసైటీ భవనంలో బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు, వాటిద్వారా ప్రజలు ఎంత మేర లబ్ధి పొందారో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు ఓ.ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, యోగానందరెడ్డి, పిచ్చిరెడ్డి, రామలక్ష్మిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మునిరెడ్డి, జయరామిరెడ్డి, పోలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లదే కీలకపాత్ర

కాశినాయన : గ్రామ సచివాలయాల్లో సచివాలయాల కన్వీనర్లదే రాబోవు ఎన్నికల్లో కీలకపాత్ర అని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల పార్టీ కార్యాలయంలో కాశినాయన మండల సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో ప్రతిఒక్కరు సైనికుల్లా పనిచేయాలన్నారు. ఈ నెల 23వ తేదీన ప్రతి బూత్‌కు సంబంధించి ఓటరు జాబితాను కన్వీనర్లకు అందజేయడం జరుగుతుందన్నారు. జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గురివిరెడ్డి, ఓబుల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, బూత్ కన్వీనర్లు, గృహసారధులు పాల్గొన్నారు.





ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అట్లూరు: బద్వేలు సుమిత్రానగర్‌లోని ప్రదీప్ హైస్కూల్‌లో చదివిన 2007–08 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సమ్మేళనంలో జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ హైస్కూలు కరస్పాండెంటు బాబు, అప్పటి డైరెక్టర్లు నాగేశ్వరరావు, మల్లికార్జున రావు, అప్పటి ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, మస్తాన్‌రెడ్డి, విలియం, మునిరెడ్డి, రమణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.





పల్లె ముంగిట పండుగ ముచ్చట



ప్రొద్దుటూరులోని గ్రీన్‌ల్యాండ్ విలాస్‌లో భోగి మంట

పాత కలతలన్నీ భోగి మంటల్లో మసిగా మారాయి..
కొంగొత్త స్నేహాలు ముంగిట ముగ్గుల మల్లె నవ్వులు తొడిగాయి..
పట్నమింటి విశేషాలు వింటూ పల్లెలు సిగ్గుల మొగ్గలయ్యాయి...
వీధి అరుగులు జ్ఞాపకాలతో తడిగా మారాయి.
మూడు రోజుల పెద్ద పండుగ ముచ్చట్లతో
పసిపాపల బోసినవ్వుల మల్లె.. పల్లె మురిసిపోయింది.

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గ్రీన్‌ల్యాండ్ విలాస్‌లో భోగి పండుగ సందర్భంగా చిన్నా పెద్దా అంతా అంతా వేడుక చేశారు. ఇంటి ముంగిళ్లలో రంగవల్లులు వేయడంతోపాటు, మహిళల కోలాటం, హరిదాసుల సంకీర్తనలతో భోగిపండును ఘనంగా నిర్వహించారు. గ్రీన్ లాండ్ విలాస్ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

కాశినాయన : మండల ప్రజలు ప్రతి ఇంటి ముందు భోగిమంటలు వేసి ఆదివారం భోగిపండుగను ఘనంగా జరుపుకున్నారు. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ భోగిమంటల చుట్టూ చేరి కేరింతలు కొట్టారు.

గోపవరం: పల్లెల్లో ఘనంగా సంక్రాంతి సందడి నెలకొంది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ పండుగకు దూర ప్రాంతాల్లో ఉండే బంధువులు, కొత్త అల్లుళ్లు ఆయా గ్రామాలకు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. పిల్లల తలపై ఉంచి భోగిపళ్లు పోశారు.

పోరుమామిళ్ల: మండలంలో పండుగ ఘనంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున 4 గంటల నుంచే భోగి మంటలు వేశారు. పట్టణంలోని శ్రీరామనగర్‌లో వీధంతా ఒకే చోట గుమికూడి భోగిమంట వేశారు. భోగిమంట చుట్టూ మహిళలు సంక్రాంతి పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేశారు.

చాపాడు : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ప్రజలు ఇంటి ముంగిట భోగిమంటలు వేసి సందడి చేశారు ఆటపాటలతో పిల్లలు ఆనందంగా గడుపుతున్నారు. మహిళలు ముగ్గులు వేస్తూ సంక్రాంతి శోభ ఉట్టిపడేలా రంగులు దిద్దుతున్నారు. వెదురూరులోని సంగమేశ్వర దేవస్థానంలో సంబరాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు.



కాశినాయన: భోగిమంట వద్ద సందడి చేస్తున్న పిల్లలు, పెద్దలు



కాశినాయన: భోగి సందర్భంగా మహిళలు వేసిన ముగ్గులు



పోరుమామిళ్ల శ్రీరామ్‌నగర్‌లో భోగిమంట



గోపవరం : చిన్నారిపై భోగిపళ్లు పోస్తున్న దృశ్యం



చాపాడు మండలంలో భోగిమంటల వద్ద ఉత్సాహంగా యువకులు

కల్యాణం.. కమనీయం



బొల్లవరంలో గోదాదేవి, శ్రీకృష్ణుని కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు



రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ధనుర్మాస పూజా కార్యక్రమాలలో భాగంగా ఆదివారం పట్టణంలోని పలు ఆలయాల్లో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలను ఘనంగా నిర్వహిచారు. బొల్లవరంలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుని కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు. స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవి, శ్రీదేవిభూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. మనోజీరావువీధిలోని రుక్మిణీపాండురంగస్వామి ఆలయంలో రుక్మిణీపాండు రంగస్వామికి కళ్యానోత్సవం నిర్వహించారు.

ఆలయంలో రంగనాథస్వామి కల్యాణం

పోరుమామిళ్ల: సంక్రాంతి పర్వదినాన ఆదివారం స్థానిక శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీగోదాదేవి రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు.